క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవి సమేత శ్రీవైభవ వేంకటేశ్వర స్వామికి గురువారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం చేస్తామని భక్తులు పాల్గొనాలన్నారు.

నెలాఖరు వరకూ సెక్షన్ 30 అమలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణం, రూరల్, అంగర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 31వ తేదీ వరకూ సెక్షన్ 30 అమలులో ఉంటుందని సీఐలు పి.దొరరాజు, సురేష్ బాబు బుధవారం తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. తప్పని పరిస్థితిలో అనుమతి పొందేందుకు రామచంద్రాపురం డీఎస్పీ కార్యాలయంలో అనుమతి పొందాలని వారు పేర్కొన్నారు.

బాణసంచా అక్రమ తయారీపై కఠిన చర్యలు



బాణసంచా కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకట నారాయణ, ఎస్సై లక్ష్మణ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెంకటాయపాలెం, ఆదివారపుపేట, తాళ్లపాలెం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను రామచంద్రపురం సీఐ ఎం.వెంకట నారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్‌లు సిబ్బందితో కలసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తయారీ, అమ్మకాలకు సంబంధించి లైసెన్స్ వివరాలను, బాణాసంచా నిల్వ చేసే విధానాలు, భద్రతా చర్యలు, అమ్మకాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విషయంలో తయారీదారులను అప్రమత్తం చేశారు. ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్నా, అమ్మకాలు చేస్తున్నా ద్రాక్షారామ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికులపాత్ర ఎనలేనిది



కార్మికులకు నిత్యవసరాలను అందిస్తున్న పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది

కాజులూరు: గ్రామీణ ప్రాంతాల ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికులపాత్ర ఎనలేనిదని గొల్లపాలెం పీఏసీ చైర్మెన్ అంగర కృష్ణ గౌడ్ అన్నారు. గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని దాదాపు 26 గ్రామాల సచివాలయాలలోనూ బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించి నిత్యవసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనికా, కార్యదర్శి రవిప్రసాద్, వీఆర్వో శ్రావణి, అంగర శ్రీను, నక్కా శ్రీను, కోకాహరి, శ్రీరామచంద్రమూర్తి, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగాదేవి తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో మండల ప్రజాపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణాకి బుధవారం గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీపీ రెడ్నం సతీష్‌లు కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన ఎంపీపీ అంబటి భవానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గీసాల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ గీసాల శతకోటి శ్రీనివాస్, కోపరేటివ్ డైరెక్టర్ గుంటూరి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ బృందం పరిశీలన

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో బాణసంచా పేలి భార్యాభర్తలు మృతి చెందిన ఘటన తెలిసిందే. బుధవారం విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించింది. బాణసంచా పేలుడుకు కారణాలు అన్వేషించింది. అక్కడున్న ఆధారాలను సేకరించింది. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

అమ్మవు.. జగదాంబవు నీవే



రాయవరంలో మహిషాసుర మర్దినిగా విజయదుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



మహిషాసుర మర్దిని అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



ఆదివారపుపేట పార్వతి అమ్మవారు

రాయవరం: చెడుపై మంచి విజయం సాధిస్తుందనడానికి సూచికగా విజయదశమి పర్వదినం ఇదే విషయాన్ని లోకానికి చాటి చెబుతుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా బుధవారం ఆయన పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పురాణేతిహాస కాలాల నుంచి చెడుపై అంతిమ విజయం మంచికే దక్కిందన్న విషయం పలుమార్లు నిరూపితమైందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కరిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ, సమాజంలో ఆధ్యాత్మికత పెంపొందించడం తద్వారా మంచిని పెంచేందుకు పీఠాలు దోహద పడుతున్నాయన్నారు. నేటి ఆధునిక, సాంకేతిక కాలంలో మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక తత్వాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజయదుర్గా అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చారు. పీఠం అర్చకులు పర్యవేక్షణలో విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

మహిషాసుర మర్దిని అమ్మవారిగా దర్శనం

రామచంద్రపురం రూరల్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో 10వ రోజు బుధవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12 వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారికి మహిషాసుర మర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో దసరా సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం దసరా సందడి నెలకొంది. కపిలేశ్వరపురంలో విచిత్ర వేషాలతో సంబరం నిర్వహించారు. అమ్మవారి వేషధారణ, కేరళ డప్పు వాయిద్యాలు, నృత్యం విశేషంగా అలరించాయి. అంగర పల్లపువీధి, కపిలేశ్వరపురం దేవీ సెంటర్, వల్లూరు, తాతపూడి, పడమర ఖండ్రిక, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లోని శిబిరాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.



కపిలేశ్వరపురంలో సంబరం

వైభవంగా సామూహిక కలశ పూజలు

రాయవరం: పట్టణంలోని దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం కలశ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాల్దారి త్రినాధశర్మ నేతృత్వంలో మహిళలు సుహాసినీ, కుమారీ పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో కలశ పూజల్లో పాల్గొన్నారు. కలశ పూజలకు ముందుగా కలశాలను శిరస్సున ధరించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దుర్గమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన వందల మంది మహిళలు కలశ పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలోని పార్వతీదేవిని దుర్గాదేవిగా అలంకరించారు.

కిటకిటలాడిన దేవాలయాలు

శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలోని వెదురుపాక, రాయవరం, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన శరన్నవరాత్ర ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దుర్గాదేవి అవతారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు దుర్గాదేవి, శివాలయాలకు పోటెత్తారు.



రాయవరంలో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

కాపు కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో కాపు కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆయన తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లు బుధవారం పూజలు చేసి ప్రారంభించారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ దివంగత జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు ఈ భవన నిర్మాణానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, నాయకులు రెడ్డింశెట్టి శ్రీనివాసరావు, పీవీవీ సత్యనారాయణ, కోటిపల్లి అబ్బు, చల్లా బుజ్జి, తోటపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



తోటపేటలో శంకుస్థాపన పూజలో పాల్గొన్న ఎంపీ బోస్ తదితరులు

నిరసన దీక్ష కొనసాగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సంఘానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.3.80 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలంటూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం మూడో రోజు సాగింది. రెండు నియోజకవర్గాల్లోని చేనేత సహకార సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం నాయకుడు, పూర్వ చేనేత కార్మిక సంఘం నాయకుడు పెద్దింశెట్టి రామకృష్ణారావు మాట్లాడుతూ, చేనేత కార్మికులను ఆదుకోవడం ప్రభుత్వ సామాజిక బాధ్యత అన్నారు. చేనేత వృత్తి రక్షణకై వెచ్చించే ఖర్చును ప్రభుత్వం ఆర్థిక భారంగా చూడరాదన్నారు. ప్రభుత్వం చేనేత సహకార సంఘానికి బకాయి పెట్టడమే సరైంది కాదని, వాటిని చెల్లించడంలో అలసత్వం వహించడం ఏమాత్రం తగదన్నారు. బకాయిలను విడుదల చేయడంలో మరింత జాప్యం చేస్తే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా సీపీఎం తరఫున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



అంగరలో సంఘీభావం తెలుపుతున్న నేలటూరు చేనేత కార్మికులు

ఈ పాపం కూటమిదే

రేషన్ బియ్యం కోసం వృద్ధురాలి అగచాట్లు

రామచంద్రపురం: ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకానికి కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పడంతో నేడు వృద్ధులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ప్రతీ నెల 1వ తేదీన రేషన్ బియ్యం ఇంటికి అందజేసింది. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పథకానికి మంగళం పాడేయటంతో వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులకు ఇంటి వద్దకే అందిస్తామని చెప్పినా అవిధంగా జరగటం లేదనేదానికి బుధవారం జరిగిన సంఘటనే నిదర్శనం. మున్సిపాల్టీలోని 25వ వార్డు గాంధీనగర్‌కు చెందిన పోతుల నాగలక్ష్మి అనే వృద్ధురాలు రేషన్ షాపు నుంచి బియ్యం తీసుకువెళ్లేందుకు పాపం నానా అవస్థలు పడింది. నెత్తిన పెట్టుకోలేక, బస్తాను మోయలేక రోడ్డు మీదనే బియ్యం మూటను ఈడ్చుకుంటూ వెళుతుంటే చూసిన వారికి గుండె తరుక్కుపోయింది. చక్కగా ఇంటి వద్దకే రేషన్ అందే పథకాన్ని తీసేసి ఇలా వృద్ధుల మీద చంద్రబాబునాయుడు ప్రభుత్వం కక్ష తీర్చుకుంటుందని వాపోయారు.



పట్టణంలోని గాంధీనగర్‌లో బియ్యం మూటను ఈడ్చుకుంటూ వెళ్తున్న వృద్ధురాలు

ఉధృతంగా గోదావరి ప్రవాహం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎగువన కురుసిన వర్షాలకు బుధవారం ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో వరద నీరు మత్స్యకార కాలనీలోనికి వచ్చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండల తహసీల్దార్ ప్రసాదరావు బుధవారం కోటిపల్లి గోదావరి గట్టు, ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని స్థానికులను కోరారు. దేవీ నవరాత్రలు ముగిస్తున్న సందర్భంగా నిమజ్జనాల సమయంలో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కోటిపల్లి మత్స్యకార కాలనీలోకి చొచ్చుకువచ్చిన వరద నీరు



కోటిపల్లిలో గోదావరిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

వృద్ధులు ఆహార నియమాలు పాటించాలి

రాయవరం: ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధులు ఆహార నియమాలు పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక సంజయ్ గాంధీ మెమోరియల్ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. వృద్ధాశ్రమం నిర్వాహకుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నేత పడాల కమలారెడ్డి, న్యాయవాది తాడి రామచంద్రారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ ఫణికృష్ణారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబులు మాట్లాడారు. ప్రతి తరం జీవన గమనానికి వృద్ధులు మార్గదర్శకులుగా నిలుస్తారని, వారిని గౌరవించుకోవాల్సిన అవసరం సమాజంలో అందరిపైనా ఉందన్నారు. చిన్ననాటి నుంచే పెద్ద వయసు వారిని గౌరవించాలని తల్లిదండ్రులు తమ చిన్నారులకు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వృద్ధులను సత్కరించి పండ్లు అందజేశారు.

వైద్య పరీక్షలతోనే వ్యాధి నిర్ధారణ

కాజులూరు: వైద్య పరీక్షలతోనే వ్యాధి నిర్ధారణ సులభతరమౌతుందని మహిళలు ఎటువంటి వ్యాధి లక్షణాలకు గురైనా తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుని మెరుగైన చికిత్స పొందాలని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్ సుకన్య అన్నారు. బుధవారం మండలంలోని మతుకుమిల్లిలో వైద్యాధికారులు 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 116 మంది మహిళలకు వివిధ వైద్యసేవలు అందించారు. కౌమార బాలికలు ప్రతీనెల హిమోగ్లోబిన్ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు చేయించుకోవాలని రక్తహీనత నివారణకు పండ్లు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెట్టా వీరనాయుడు, ఎంపీటీసి గొల్లపల్లి సింహాద్రి, ఉప సర్పంచ్ ఆకుమర్తి సుబ్బారావు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో స్వస్థ్ నారీ– సశక్త్ శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని అర్తమూరులో శ్రీసత్య భాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చిర్ల వెంకట రెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య భద్రతే ధ్యేయం

రామచంద్రపురం: మహిళల ఆరోగ్య భద్రత కోసం, వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం సాధించవచ్చని, మహిళల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా స్వస్థ్ ఏనారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వాటిపై అవగాహన కల్పించామన్నారు. మహిళలు, గర్భిణులకు, కిషోర్ బాలికలలో రక్తహీనతను గుర్తించి వారికి చికిత్సలు అందించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యుక్త వయసు బాలికలు, మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకొని జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెటి సత్యం వైద్యులు కార్తీక్, చక్రధర్, కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



రోగులతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, తదితరులు

పుల్లారావును కలిసిన కౌన్సిలర్



అమలాపురంలో పుల్లారావును కలిసిన రవికుమార్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పుల్లారావును బుధవారం మండపేటకు చెందిన దళిత నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుల్లారావు గతంలో మండపేట పట్టణ, రూరల్ సీఐగా పని చేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో మండపేట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, నాయకులు దార్ల పుల్లారావు, మడికి ఆనందరావు కలిసిన వారిలో ఉన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని కేశవరంలో బుధవారం అనపర్తి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన చెవి, ముక్కు, గొంతు శిబిరంలో డాక్టర్. భార్గవ ఫణికృష్ణ 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు పర్యవేక్షణలో స్థానిక ఆనంద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో ఉచితంగా మందులు అందజేశారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కపిలేశ్వరపురం (మండపేట): దసరా పండగ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రూపొందించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేశారు. మండపేట మండలంలోని ఏడిద సీతానగరం, ఏడిద సావవరం, ఏడిద, దుళ్ల గ్రామాల్లో కమిటీ అధ్యక్షుడు శేఖర్ బాబు, తదితరులు పలు అంశాలను వివరించారు.